తంగా, గర్భవతయినాను. నా స్నేహితులు నాకు ఈవిషయంలో సహాయంచేసి, ఆపిల్లవాణ్ణి ఇందాక మీరు చూసిన దంపతులకి ఇచ్చివేశారు. ఆకుర్రాడంటే నాకు చాలా మమకారం వుంది, అతని పోషణిని ఇన్నాళ్ళబట్టీ నేనే భరిస్తూవచ్చాను. ఇకముందు భరిస్తాను. ఇది, మన పెళ్ళికాకముందు సంగతి. అప్పుడు అకస్మాత్తుగా జరిగిన దురదృష్టానికి నన్ను ఇవ్వాళ మీరు సంజాయిషీ అడిగేట్టయితే- నేనేమీ చెప్పలేను. నేను ఇంకొకర్ని దేనికోసమూ సంజాయిషీ అడగను. ఇంకొకరు నన్ను దేనికోసమూ సంజాయిషీ అడగటం అనవసరం' అని తెగేసి చెప్పింది.

కృష్ణరాజు, కోపోద్రేకంతో, కత్తి కిందికి విసరిపారేశాడు. 'ఉద్ధరించావు — లం...నిన్ను ఖూనీచేసి ఆ స్త్రీ హత్య ఎక్కడ మొయ్యను. పో- ఈ ఇంటోనుంచి; నీ పిల్లాడి దగ్గరకో, నీ రంకుమొగుడి దగ్గరకో—...సంసారమట- ధైర్యమట—...' అంటో, ఆమెని వాకిలిదాకా ఈడ్చుకొచ్చి, రోడ్డుమీదికి నెట్టి తలుపేసుకున్నాడు నిశ్చింతగా.

కామేశ్వరి, ఏమీ ఆశ్చర్యపడకండా, ఆవేశపడకండా, అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

# నడిరాత్తిరి నల్లమేఘాలు

యం. హీరాలాల్ రాయ్

భారతదేశ విభజనమూలంగా లక్షలాది ప్రజలు దుర్భరావస్థల పాలయ్యారు. లక్షల సంఖ్యలో ప్రజలు మృత్యుదేవతకు ఆహుతి అయ్యారు. అంతకు రెండురెట్లమంది దారిద్ర్యంలో మునిగిపోయారు. సుందరమైన భవనాలలో నివసిస్తూ వెండి పళ్ళాలలో భోంచేయడానికి అలవాటుపడ్డ సంపన్నవంతులంతా, దమ్మిడీలేని దద్దమ్మలంగా మారిపోయారు. సీతావు తల్లికన్న మిన్నగా తమ శీలాన్ని కాపాడుకున్న మగువలు, రొట్టెముక్కకోసమై లొంగిపోయారు. భారత చరిత్రలో అంతటి లజ్జావిహీనమైన సంఘటన ఎప్పుడూ జరిగివుండలేదనే చెప్పాలి.

1947 సంవత్సరంలో జరిగిన ఆ సంఘటనను ఎప్పుడూ మరిచిపోలేను. జనాభామార్పిడిమూలంగా మేము అన్నివిధాలా సన్యాసులమయ్యాం. పైగా, దారులమధ్య బందిపోటు దొంగలు మమ్మల్ని ఇంకా సర్వనాశనం చేశారు. తమ సుందర భవనాలముందు, ఏనుగులను ఆల్లారు ముద్దుగా పెంచిన సంపన్నవంతులు, నేడు దిక్కులేని కుక్కలమాదిరి, ఎంగిలి రొట్టె ముక్కలకు కూడా లొంగిపోయారు. దిక్కులేని ఈ లక్షలాది సంతానం. ఢిల్లీనగరం చేరుకుంటుందన్న వార్త విని వర్తకులు చంకలెగరేశారు. వీలున్నంత వరకూ అధికలాభాలు గడించవచ్చుననే ఆశతో అసంఖ్యాకంగా వర్తకులు ఢిల్లీ చేరుకున్నారు.

అసంఖ్యాకులైన ఈ బాధితులందరూ, ఢిల్లీ నగరంమీద, పరిపూర్ణమైన ఆశలు పెట్టుకున్నారు. 'ఢిల్లీలాంటి నగరంలో, ఆకలికి ఆహుతి అయ్యేవాడుండడు. అంతా అన్నపూర్ణమ్మలే వుంటారు' అని భావించారు. నెహ్రూ, పటేల్ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్‌లాంటి మహానేతలు నివసించే నగరంలో, ఆకలి సమస్యే వుండదు; పేదలపాలిటి పెన్నిధి గాంధీ మహాత్ముడుకూడా అక్కడే వుంటాడు. కాబట్టి అక్కడ మా ఆకలి సమస్యే వుండదని వారు ఊహించారు. కాని, పాపం వారి ఆశలన్నీ ఆవిరిలాగా ఎగిరిపోయినై. గాంధీ, నెహ్రూ మాటలు వినేవాళ్లెవరు? వీరి ఉపన్యాసాలంటే ప్రజలకు అకస్మాత్తుగా అజీర్ణం పుట్టుకొస్తుంది. ఈ ఉపన్యాసాలు మేతపెట్టవని వారికి నమ్మకం ఏర్పడిపోయింది. పైగా, వీళ్లకు ఈ ఉపన్యాసాలంటే చికాకుకూడా. ఢిల్లీ సందుగొందుల్లోనూ, పేవ్‌మెంట్లమీదనూ, జనసమ్మర్దం పెరిగి

పోయింది. పేవ్ మెంట్లు తమ రాతిగుండెలపైన అసంఖ్యాక అనాథలకు ఆశ్రయమిచ్చాయి.

ఢిల్లీ రెస్టారెంటుకు సమీపంలో, ఒక ముసలివాడు వంగివున్నాడు. వాడివెంటచే ఒక మగమనిషి, ఒక స్త్రీ, ఒక పిల్లవాడుకూడా వున్నారు. ఆకలి అందర్నీ నిలువునా కుంగదీసింది. ప్రక్కనే వున్న పార్కులలో, చప్పట్లు వినిపిస్తున్నాయ్. ఎవడో నాయకుడు మాట్లాడుతున్నాడు. ముసలివాడిలో ఆలోచనా ప్రవాహం ఆరంభమైంది. 'మీటింగులకు వెళ్లి ఉపన్యాసాలు వింటానికి, వీళ్లందరికీ ఎలా వీలు చిక్కుతూంది? చక్కగా శృంగారించుకుని, ఘుమఘుమాయించే వాసనలను ఎదుటివారిమీదికి ఎగజిమ్ముతూ, సకుటుంబ సపరివారంగా సభలకు రావడానికి వీళ్ళందరికీ ఎలా అవకాశం దొరికింది? చూడు. అటు ఎన్ని కార్లు వచ్చి వరుసగా నిలబడ్డాయో! అబ్బ. ఈ సభలుకూడా మా పాలిట రథసలుగా మారిపోతాయి.

మోటర్ల సంఖ్య పెరిగిపోతూ వున్నకొద్దీ, మాలాంటి అనాథులమంతా, మర్యాదగా పేవ్ మెంట్లు ఖాళీచేసితప్పుకోవాలి. లేకుంటే పోలీసు వాళ్ళ కొరడా దెబ్బల మోతలు మా వీపులమీద మక్కికిమక్కిగా అచ్చుగుద్దుకుని పోతాయ్. ఆలోచిస్తూనే వున్నాడు ముసలాడు. చీకటి పడ్డది. విద్యుద్దీపాలు అకస్మాత్తుగా వెలిగి, నగరాన్ని ఇంకా నాగరికం చేశాయి. రంయిమంటూ కార్లు పోతున్నయ్. ముసలాడి అదృష్టాలు అంతకన్నా వేగంగా పరుగెత్తుతూన్నయ్.

ఢిల్లీ రెస్టారెంటుకు ఎదురుగా, గొప్ప భవనాలున్నయ్. ఆకాశంలో చుక్కల్ని లెక్కిస్తున్న ఢిల్లీ రెస్టారెంటు భవనం, రహదారిపై సాగిపోతూన్న జనానీకంపై నిమలిత నేత్రాలతో కూడుకున్న ముసిముసి నవ్వుల్ని విసిరేస్తూ వున్నది. అప్పుడప్పుడు ఈ అనాథలవైపు చూసి 'ఇంత నీచంగా వున్నారేం?' అంటూ మూతి విరుచుకుంటోంది. పేవ్ మెంట్లమీద రకరకాల మనుష్యులున్నారు. వారి గుడ్డలన్నీ చీకిపోయినై. వాటినుండి దుర్వాసనలు బయటికొస్తునై. గడ్డాలు పెరిగి, ముఖాలు నల్లబడి, కళ్ళు లోతుకు గుంజుకుని, వాళ్ళంతా జీవచ్ఛవాలుగా వున్నారు. మగవాళ్లే కాదు! అందులో చాలామంది ఆడవాళ్ళుకూడా వున్నారు.

ముసలాడు నోరు కదపకుండా, తన కళ్ళ ఎదురుగా జరుగుతున్న జగన్నాటకాన్ని వీక్షిస్తూవున్నాడు. ముసలాడి ప్రక్కనవున్న స్త్రీలో, సౌందర్యం తొణికిసలాడుతూవుంది. అయితే పోషణలేరి ఆ సౌందర్యంలోని తారతమ్యం స్పష్టంగానే గోచరిస్తూంది. కూటికి మలమల మాడుకూర్చున్న కుర్రవాడిలో, కుర్రతనంకూడా మాయమైంది. ఆకలి అతనిలో మేల్కొల్పింది. తల్లి తండ్రుల కష్టాన్నికూడా అర్థం చేసుకుంటూన్నాడు.

ఢిల్లీ రెస్టారెంటు రాత్రులలో ఇంద్రభవనంలాగా వుంటుంది. ముసలాళ్లలోకూడా ముచ్చటల్ని మేలుకొల్పే అలంకారాలతో జంటలు జంటలుగా స్త్రీలూ, పురుషులూ వస్తూ పోతూ వుంటారు. వాళ్ళంతా తమ వాహనాల్ని ఎదురుగావున్న చౌకులో వుంచుతారు. అక్కడినుండి రెస్టారెంటుకు నడిచి వెళ్ళడంలో యువకుల హృదయాలకు చక్కలిగింతలు కలుగుతాయి. బాధితులైన యువతులు, చేతులుచాపి, దేబిరిస్తూ వుంటారు. రొమ్ముల్ని దాచుకోవడానికికూడా కొందరికి గుడ్డలేదు. రెస్టారెంటుకు పోయే యువకులకు, ఈ రొమ్ముల్లోవున్న దైన్యానికి బదులు శృంగారాన్ని చిత్రించుకుని ఆత్మ సంతృప్తి చెందుతారు.

కొంటెగా యువకులు కొందరు వాళ్ళని మందలిస్తారు. 'ఆ వక్షస్థలాలే నీపాలిటి కామధేనువులు. ఇంకా నీకు బిచ్చమెందుకు?' అన్నారు చాలామంది.

రెస్టారెంటులోని ప్రపంచానికీ, బయటి ప్రపంచానికీ చాలా తారతమ్యం వుంది. బయట పేవ్ మెంట్లమీద, ఆకలితో క్రుంగిపోయి, విద్యుద్దీపాల మూలంగా మెరుస్తూన్న వదనాలతో, జీవచ్ఛవాలు కనిపిస్తాయ్. రెస్టారెంటులో, ఇంద్రభవనంలో దేవతలా అన్నట్లు కనుపిస్తారు మనుషులు. ఇక్కడ కష్టపరంపరల్లో చిక్కుకున్న కాందిశీకులు; అక్కడ మత్తుపదార్థాల మజాలో, కాందిశీక సమస్యపై చర్చలు-ఇక్కడ చావుకు

సిద్ధంగా వున్నారు ప్రజలు, మరి అక్కడ? 'చావు ఎలా వస్తుంది' అన్న విషయంపై వేదాంత చర్చలు.

చీకటి బాగా నల్లబారింది. ఒక సిపాయి మత్తు నిషాలో నడుస్తూ, ముసలాడి ప్రక్కన వున్న స్త్రీవైపుకి వస్తూన్నాడు. ఆ సిపాయి స్త్రీ దగ్గరకు వచ్చి నీకు అన్నం, బట్ట కావాలా?' అని అడిగాడు. అన్నంమాట వినగానే పక్కనే వున్న మగమనిషి లేచి కొండంత ఆశతో 'ఏదీ అన్నం?' అని అడిగాడు. సిపాయికి కోపం వచ్చింది. 'అగవోయ్ కుక్కా! మగపురుగువి, దూరం తొలగు' అంటూ స్త్రీని పట్టుకో బోయాడు. మగమనిషి కోపంతో అగ్గి అయి పోయాడు. అతని కళ్ళలోకి తొంగిచూచి, భర్త పౌరుషాన్ని గమనించి వెనక్కి తగ్గాడు సిపాయి. బలహీనుడైన మగవాడిలోని కోపాలు వెంటనే చల్లారిపోయాయి. అయితే స్త్రీమాత్రం ఈ సంఘటనకు వణికి పోయింది.

తెల్లవారింది. ముసలివాడు అంతిమయాత్ర సాగించాడు. కొడుకు, కోడలు, శవాన్నికూడా అక్కడే పారేసి వెళ్ళిపోయారు. ఆకలికి మానమర్యాద లేమిటి? తండ్రి కొడుకుల మధ్య వున్న రక్త సంబంధాన్నికూడా ఆకలి హరించివేసింది.

ముసలాడి కొడుకు, కోడలు, కుర్రాడు నడిచి పోతూన్నారు. దారిలోని దృశ్యాలన్నీ మగమనిషిలో ఆలోచనలను మేల్కొల్పుతూ వున్నయ్. ఈ ప్రపంచంమీద, ఈ స్వాతంత్ర్యం మీద, విపరీతంగా కోపం పుట్టుకొచ్చింది. విప్లవం తీయాలి. ఈ భవనాల వెక్కిరింతలను ఇంకెంత కాలం సహించాలి? ఆలోచనల మహాప్రవాహంలో మునిగి తేలుతూ ముందుకు సాగిపోయాడు.

ముసలాడి శవాన్ని మునిసిపాలిటీవారు తీసుకుపోయారు. తల్లి, పిల్లవాడు ఈపూట తినడానికి ఏమైనా తెస్తాడని, మగమనిషిపై ఆశపెట్టుకుంటారు అయితే యథాప్రకారంగా ఉత్త చేతుల్తోనే తిరిగి వస్తాడు మగవాడు.

రాత్రి పదికొట్టారు. ఆడమనిషికి నిద్ర రావడంలేదు. భర్త, కుర్రవాడు పక్కనే పొట్టలకు రాళ్లు కట్టుకుని నిద్రపోయారు. నిన్నటి సిపాయి తిరిగి వచ్చాడు. ఆడమనిషి వైపుకు చెయ్యూపాడు. సిపాయి యేంకోరుతున్నాడో ఆడదానికి తెలుసు. ప్రక్కనే నిద్రిస్తున్న రెండు జీవాలనీ ఒక్కసారి చూసింది. అక్కడినుంచి మెల్లగా లేచి బయలుదేరింది సిపాయి వెంట. ఆ స్త్రీమూర్తి కళ్లు 'నేను అమ్ముడు పోవడానికి సిద్ధంగా వున్నానని' అంటూ వున్నయ్

రాత్రంతా నిశ్శబ్దంగా జరిగిపోయింది.

తెల్లవారింది. మగమనిషి, కుర్రవాడు చాలా సంతోషంగా కనిపించారు. ఉండడానికే యేదైనా మంచి ప్రదేశంకోసం నిరీక్షిస్తున్నారు. అయితే, స్త్రీమూర్తిమీద నిశ్శబ్దత తాండవిస్తూ వుంది. మగవాడు తన భార్యతో 'నిజంగా మనం అదృష్టవంతులం!... నీకు బజారులో వంద రూపాయల నోట్లు రెండు దొరికాయి. మనమంతా సుఖంగా జీవించగలం. లేకుంటే నాన్నలాగా మనంకూడా చచ్చిపోవాల్సి వచ్చేది. ఎంతైనా భగవంతుడు దయామయుండు సుమా!' అన్నాడు.

ఆడమనిషి వింటూనే వున్నది. మాట్లాడలేదు.

'భగవంతుడు నిజంగా దయామయుండేనా!' అన్న ఆలోచనలో పడిపోయింది.

పురపాలక సంఘం చర్యల్ని ఖండిస్తూ ఒక సంపాదకుడిలా రాశాడు: "ఈ పట్టణం మునిసిపాలిటీ సభ్యుల్లో సగం మంది మంద బుద్ధులు." అది చదువుకుని వారంతా అతన్ని క్షమాపణ యివ్వకపోతే చర్య తీసుకుంటామని బెదిరించారు. అతడు క్షమాపణ యీ విధంగా మళ్లీ పత్రికలో ప్రచురించాడు: "వెనక నేను రాసింది పొరపాటు. పురపాలక సంఘంలో సగం మంది మంద బుద్ధులు కారు."